సాక్షి
ఏలూరు
శుక్రవారం । 8 । సెప్టెంబర్ । 2023



నేడు సామూహిక వ్రతాలు

ద్వారకాతిరుమల చినవెంకన్న క్షేత్రంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. 8లో ▸



కృష్ణా.. ముకుందా..

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. పలుచోట్ల ఉట్టి వేడుకలు నిర్వహించారు. 8లో ▸

29 నుంచి బాస్కెట్‌బాల్ పోటీలు

మార్టేరులో ఈనెల 29 నుంచి ఆంధ్రప్రదేశ్ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ మెన్, ఉమెన్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు జరుగనున్నాయి. 8లో



న్యూస్‌రీల్

వేగంగా భూహక్కు పత్రాల పంపిణీ



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

ఏలూరు(మెట్రో): జిల్లాలో నెలాఖరు నాటికి భూహక్కు పత్రాలు పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలని భూపరిపాలన ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ కలెక్టర్లను ఆదేశించారు. గురువారం విజయవాడ సీసీఎల్‌ఏ కార్యాలయం నుంచి కలెక్టర్లు, కలెక్టర్లతో రీ సర్వేపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఏలూరు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, ఆర్డీఓలు కె.పెంచల్‌కిషోర్, ఝూన్సీరాణి, ఏడీ సర్వే వెంకటేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భూహక్కు పత్రాల పంపిణీపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. కొన్ని జిల్లాల్లో ఆన్‌లైన్‌లో పెండింగ్‌లో ఉన్న కరెక్షన్ ఆఫ్ మాడ్యూల్స్‌ను పూర్తిచేసి భూహక్కు పత్రాలను జనరేట్ చేసి ప్రింటింగ్‌కి పంపించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియను నిర్దేశిత గడువులోపు పూర్తిచేయాలన్నారు. పేదలకు అసైన్ చేసి ప్రభుత్వ భూమికి సంబంధించి వివరాలు 10వ తేదీనాటికి అప్‌లోడ్ చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ ఫేజ్–2 కింద పెండింగ్‌లో ఉన్న భూహక్కు పత్రాలు జిల్లాకు రాగానే త్వరితగతిన పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఐటీఐ ప్రవేశాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలోని ఐదు ప్రభుత్వ, 14 ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో 2023–24కి గాను మిగిలిన సీట్ల భర్తీకి నాల్గో విడత కౌన్సెలింగ్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏలూరు ఐటీఐ ప్రధానాధికారి పి.రజిత ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 19వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు. అనంతరం దరఖాస్తు కాపీ, ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈ నెల 20 సాయంత్రం 5 గంటలలోపు సంబంధిత కళాశాలలో వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. వెరిఫికేషన్ పూర్తయిన వారు మాత్రమే కౌన్సెలింగ్‌కు అర్హులని తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ కళాశాలల్లో 205 సీట్లు, ప్రైవేట్ కళాశాలల్లో 1,028 సీట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాలకు ఈనెల 22న, ప్రైవేట్ కళాశాలల్లో ప్రవేశాలకు 23న కౌన్సెలింగ్ నిర్వహిస్తామని, వివరాలకు 08812–230269 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

నేడు సలహా మండళ్ల సమావేశం

ఏలూరు(మెట్రో): జిల్లా వ్యవసాయ సలహా మండలి, నీటిపారుదల సలహా మండలి సంయుక్త సమావేశం శుక్రవారం సాయంత్రం 4 గంటలకు గోదావరి సమావేశ మందిరంలో నిర్వహిస్తామని ఏలూరు ఇరిగేషన్ సర్కిల్ పర్యవేక్షక ఇంజనీర్ కె.శ్రీనివాస్ తెలిపారు. ఖరీఫ్ 2023–24 పంటకు సంబంధించి వర్షాభావ పరిస్థితులను అనుసరించి నీటి లభ్యతపై కలెక్టర్ ఆధ్వర్యంలో చర్చిస్తారని పేర్కొన్నారు. సభ్యులంతా హాజరుకావాలని కోరారు.

తాగునీటి కోసం మరో రూ.21 కోట్లు

చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు



తాగునీటి చెరువును పరిశీలిస్తున్న చీఫ్ విప్

నరసాపురం రూరల్: నరసాపురం పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు అదనంగా రూ.21 కోట్లు మంజూరైనట్లు ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు అన్నారు. అమృత పథకం జీఓ 68 ద్వారా తాగునీటి వసతుల కల్పనకు ఈ నిధులు మంజూరయ్యాయన్నారు. ఇప్పటికే పట్టణంలోని మంచినీటి చెరువులు, ఓవర్‌హెడ్ ట్యాంకు అభివృద్ధి, కొత్త పైప్‌లైన్ నిర్మాణం తదితర పనులకు రూ.62 కోట్లు మంజూరు చేయించి సీఎం జగన్ చేతులమీదుగా శంకుస్థాపన చేయించగా పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో అదనంగా మరిన్ని నిధులు మంజూరు కావడం శుభ తరుణమని ఆనందం వ్యక్తం చేశారు. ఇప్పటికే పీచుపాలెం, చినమామిడిపల్లి, మాధవాయిపాలెం ప్రాంతాల్లో ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం పూర్తయ్యిందని, అదనపు నిధులను నరసాపురంలో ప్రధాన చెరువు విస్తరణ, నిల్వ సామర్థ్యం పెంపు, చెరువుకు ఫెన్సింగ్, సుందరీకరణ తదితర పనులకు వెచ్చిస్తామని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు తెలిపారు.

సామాజిక చైతన్య వీచికలు

ఎస్‌బీసీసీ కేంద్రాలు

- సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై గురి
- క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారం
- రక్తహీనతపై 830 అవగాహన కార్యక్రమాలు
- బాల్య వివాహాల నివారణపై సదస్సులు



పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌బీసీసీ జిల్లా కో–ఆర్డినేటర్ స్నేహన్ (ఫైల్)

ఏలూరు టౌన్: కోవిడ్ నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న పరిణామాలు ప్రజల జీవన ప్రమాణాలపై పెను ప్రభావాన్ని చూపాయి. ఈ నేపథ్యంలో ఐక్యరాజ్యసమితి (యూనిసెఫ్) సహకారంతో నిర్దేశిత లక్ష్యాల సాధనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాయి. కరోనా విలయంతో ఎదురైన సవాళ్లను అధిగమించేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ, సామాజిక సంస్థలు, సామాజిక పరిశోధకులు మానవాభివృద్ధికి లక్ష్యాలను నిర్దేశించారు. 2030 నాటికి ఆకలి లేని సమాజం, మెరుగైన ఆరోగ్యం, నాణ్యమైన విద్య, లింగ వివక్ష నిర్మూలన వంటి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలుగా పెట్టుకున్నారు. లక్ష్యాల సాధనకు ప్రజలను చైతన్యవంతం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోంది. దీనిలో భాగంగా సామాజిక ప్రవర్తన మార్పు సమాచార కేంద్రాలు (ఎస్‌బీసీసీ) ఏర్పాటుచేసింది.

ఎస్‌బీసీసీ సెంటర్లు ఇలా..

ఏలూరు జిల్లాలో ఎస్‌బీసీసీ ప్రజలను చైతన్యవంతులను చేస్తూ విస్తృత అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోంది. గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరించే ఎస్‌బీసీసీలో జిల్లా వైద్యారోగ్య, విద్యాశాఖ, మహిళ అభివృద్ధి–శిశు సంక్షేమం, డీఆర్‌డీఏ, మెప్మా అధికారులతో పాటు ఒక స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి, జిల్లా కో–ఆర్డినేటర్ సభ్యులుగా ఉంటారు. ఎస్‌బీసీసీ గ్రామీణ, అర్బన్ ప్రాంతాల్లో ప్రజలకు పలు అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

జిల్లాలో కార్యక్రమాలు ఇలా..

ఏలూరు జిల్లాలో సచివాలయాల శాఖ ఆధ్వర్యంలో జిల్లా నోడల్ అధికారి రమణ, ఎస్‌బీసీసీ కేంద్రం జిల్లా కో–ఆర్డినేటర్ టీఎస్ స్నేహన్ ఆధ్వర్యంలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గతేడాది ఆగస్టు నుంచి ఈ ఏడాది ఆగస్టు వరకు 156 ఉన్నత పాఠశాలలు, 331 అంగన్‌వాడీ కేంద్రాలు, 100 వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాలను సందర్శించి అవగాహన కల్పించారు. అలాగే బాలలకు రక్తహీనతతో వచ్చే అనర్థాలను వివరిస్తూ సుమారు 830 అవగాహన సదస్సులు ఏర్పాటుచేశారు. గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాలతో ఎదురయ్యే దుష్ప్రభావాలపై ప్రత్యేకంగా 501 ఉన్నత పాఠశాలల్లో బాలికలకు అవగాహన కల్పించారు. బాలికలకు బాలల చట్టాలు, టోల్‌ఫ్రీ నంబర్లపైనా చైతన్యవంతం చేస్తున్నారు. ఈ కార్యక్రమం నిరంతరాయం కొనసాగేలా కార్యాచరణ రూపొందించారు.

ఎస్‌బీసీసీ కార్యక్రమాలు	
ఉన్నత పాఠశాలలు	156
అంగన్‌వాడీ కేంద్రాలు	331
వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాలు	100
రక్తహీనతపై అవగాహన సదస్సులు	830
బాల్యవివాహాల నివారణపై సదస్సులు	501

జీవన ప్రమాణాల మెరుగు



సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ సారథ్యంలో ప్రభుత్వ పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఇతర గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. జిల్లాను బాల్యవివాహ రహితంగా తీర్చిదిద్దేందుకు విస్తృత ప్రచారం చేస్తున్నాం. కరోనా అనంతర పరిణామాలతో ప్రజల జీవన స్థితిగతుల్లో మార్పులు రావటంతో వాటిని అధిగమిస్తూ జీవన ప్రమాణాలు మెరుగుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఈ మేరకు పనిచేస్తున్నాం.

– రమణ, జిల్లా నోడల్ ఆఫీసర్, జిల్లా సచివాలయాల శాఖ

చైతన్యమే లక్ష్యంగా..

- సుస్థిర అభివృద్ధి సాధనకు కొన్ని కీలక అంశాలు లక్ష్యంగా పెట్టుకున్నారు.
- ముఖ్యంగా రక్తహీనత, బాల్య వివాహాలు లేని సమాజాన్ని సాధించాలి.
- ప్రజలకు ఆహారం, ఆరోగ్యం అందించేలా శ్రద్ధ తీసుకోవాలి.
- ఆహార భద్రతలో భాగంగా రేషన్ సరుకులు సక్రమంగా ప్రజలకు చేరుతున్నాయా అనేది సచివాలయాలు బాధ్యత తీసుకోవాలి.
- ప్రభుత్వ స్కూళ్లలో జగనన్న గోరుముద్ద, అంగన్‌వాడీ కేంద్రాల్లో వైఎస్సార్ సంపూర్ణ పోషణ ఆహారం అర్హులకు సరైన రీతిలో అందుతున్నాయా అనేవి పర్యవేక్షించాలి.
- గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు ప్రతి నెలా రక్తహీనతపై పరీక్షలు జరుగుతున్నాయో లేదో పరిశీలించాలి.
- ఆయా అంశాలపై నిత్యం ఎస్‌బీసీసీ కేంద్రాలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ మహిళలు, విద్యార్థినులకు అవగాహన కార్యక్రమాలు, సదస్సులు నిర్వహిస్తూ చైతన్యవంతులను చేయాలని నిర్దేశించారు.

విద్యా సంస్కరణలు రాష్ట్రంలో భేష్

నోబెల్ గ్రహీత మైకేల్ రాబర్ట్ క్రెమర్



కలపర్రు హైస్కూల్‌లో నోబెల్ గ్రహీత క్రెమర్

పెదపాడు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విద్యాసంస్కరణలు భేష్ అని, ప్రభుత్వం అందించే సాంకేతిక విద్యావిధానంలో విద్యార్థులు పూర్తి మూర్తిమత్వం పొందుతారని నోబెల్ అవార్డు గ్రహీత మైకేల్ రాబర్ట్ క్రెమర్ (అమెరికా) ప్రశంసించారు. క్రెమర్‌తోపాటు చికాగోలోని దిల్ యూనివర్సిటీకి చెందిన ఎమిలీ క్యుపిటో బృందం పర్సనలైజ్డ్ అడాప్టివ్ లెర్నింగ్ (పాల్) ప్రాజెక్టు అమలు చేస్తున్న పాఠశాలల సందర్శనలో భాగంగా రాష్ట్ర కమిటీతో పాటు క్రెమర్ గురువారం మండలంలోని కలపర్రు జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించారు. పాఠశాలలో ట్యాబ్‌లు, బైజూస్ కంటెంట్‌తోపాటు ఇతర బోధనోపకరణాలు, కంప్యూటర్ ల్యాబ్‌ను పరిశీలించారు. విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి ల్యాబ్ వినియోగం వల్ల ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో అభివృద్ధి చేయాల్సిన విషయాలపై ఉపాధ్యాయులతో చర్చించారు. ట్యాబ్‌ల వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాల్ ప్రాజెక్టు అమలుచేస్తున్న పాఠశాలల్లో సేవలను అధికారులు ఆయనకు వివరించారు. పాల్ ప్రాజెక్టు అమలులో ఆంధ్రప్రదేశ్ క్రెమర్ అత్యంత ప్రాముఖ్యతగా నిలిచిందని సంతృప్తి వ్యక్తం చేశారు. పాల్ లాబ్స్ వ్యక్తిగత రాష్ట్ర కమిటీ కో–ఆర్డినేటర్ ఎన్‌వీ సత్యం, ఎంఈఓ సబ్బితి నర్సింహమూర్తి, ప్రధానోపాధ్యాయుడు భీమయ్య, పాల్ లాబ్స్ జిల్లా కో–ఆర్డినేటర్ యోహాను, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆర్‌అండ్‌ఆర్ గ్రామసభలు



ఎం.సూర్యతేజ, ఐటీడీఏ పీఓ

వేలేరుపాడు: వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో గ్రీవెన్స్‌లో ఉన్న ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీకి సంబంధించి గ్రామసభలు శుక్రవారం నుంచి ఈనెల 15 వరకు నిర్వహించనున్నట్టు కేఆర్‌పురం ఐటీడీఏ పీఓ, ఆర్‌అండ్‌ఆర్ అధికారి మల్లవరపు సూర్యతేజ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామసభలకు వచ్చే నిర్వాసితుడు ఆధార్ కార్డు, 2015, 2016, 2017లో ఇంటిపన్ను రశీదులు, రేషన్ కార్డు, బ్యాంకు ఖాతా తదితర ఆధారాలు తీసుకురావాలని సూచించారు. అన్ని ఆధారాలు ఉండి స్థానికంగా నివాసముంటున్న నిర్వాసితులకు న్యాయం జరుగుతుందని, ఏ ఒక్కరికీ అన్యాయం జరగదని పేర్కొన్నారు. గ్రీవెన్స్‌లో వేలేరుపాడు మండలంలో 383 మంది, కుక్కునూరు మండలంలో 192 మంది నిర్వాసితులు గ్రామసభలకు తప్పక హాజరుకావాలని తెలిపారు. తహసీల్దార్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారుల ఆధ్వర్యంలో గ్రామస్తుల సమక్షంలో చెక్ లీస్ట్ ప్రకారం విచారణ చేస్తారని పేర్కొన్నారు.

గ్రామసభలు ఇలా..

- 8న.. వేలేరుపాడు మండలంలోని వేలేరుపాడు, కుక్కునూరు మండలంలోని దామరచర్ల, చీరవల్లి గ్రామాలు
- 11న.. వేలేరుపాడు మండలంలోని జగన్నాథపురం, రుద్రమకోట గ్రామాలు
- 12న.. వేలేరుపాడు మండలంలోని రేపాకగొమ్ము, తిర్లాపురం, కుక్కునూరు మండలంలోని కివ్వాక గ్రామాలు
- 13న.. వేలేరుపాడు మండలంలోని నార్లవరం, నార్లవరం కాలనీ, నాగులగూడెం, తాట్కూరుగొమ్ము, కుక్కునూరు మండలంలోని గొమ్ముగూడెం, రామచంద్రాపురం గ్రామాలు
- 14న.. వేలేరుపాడు మండలంలోని కొయిదా, కట్కూరు, బుర్రెడ్డిగూడెం, చిగురుమామిడి, కుక్కునూరు మండంలోని కుక్కునూరు గ్రామాలు
- 15న.. వేలేరుపాడు మండలంలోని కన్నాయిగుట్ట, శ్రీరాంపురం గ్రామాలు

నూరుశాతం హామీల ఘనత సీఎం జగన్‌దే..

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



లబ్ధిదారులకు నూతన పింఛన్లు అందిస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నూరుశాతం అమలు చేసి చూపించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం నూజివీడు మండలానికి మంజూరైన 504 పింఛన్లు, పట్టణానికి మంజూరైన 301 నూతన పింఛన్లను లబ్ధిదారులకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే జనవరిలో రాష్ట్ర ప్రభుత్వం పింఛన్‌దారులకు రూ.3 వేల చొప్పున పింఛను నగదు అందజేస్తుందన్నారు. సీఎం జగన్ చెప్పాడంటే చేసినట్లేనని, పార్టీలకతీతంగా ప్రభుత్వ పథకాలను అర్హులకు అందజేస్తున్నామన్నారు. చంద్రబాబు చెప్పేవన్నీ అసత్యాలు, అబద్ధాలేనని వీటిని నమ్మి టీడీపీకి ఓటేస్తే గోదారిలో వేసినట్లేనన్నారు. 2014లో 650 వాగ్దానాలు ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు వాగ్దానాలు కూడా నెరవేర్చలేదని మండిపడ్డారు. రుణమాఫీ చేయకుండా డ్వాక్రా మహిళలను, రైతులను నిలువునా ముంచేసిన వ్యక్తి చంద్రబాబు అని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం దాదాపు 40 సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఇన్ని పథకాలు అమలు కావడం లేదన్నారు. కరోనా వల్ల రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఇబ్బందులు ఎదురైనా సీఎం జగన్ ఏ ఒక్క పథకాన్ని ఆపలేదన్నారు. చంద్రబాబు దిగిపోయేనాటికి నూజివీడు పట్టణంలో 2,916 పింఛన్లుంటే ఇప్పుడు 5,514 పింఛన్లు ఉన్నాయని, వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో 2,598 పింఛన్లు అదనంగా మంజూరు చేశామన్నారు. చంద్రబాబు 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా చేసి ఏనాడూ పింఛన్‌దారుల సంక్షేమాన్ని పట్టించుకోలేదన్నారు. ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా ఉండాలని కోరారు. ఎంపీపీ ఆరేపల్లి శిరీష, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు పగడాల సత్యనారాయణ, కొమ్ము వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము ప్రసంగించారు. అనంతరం లబ్ధిదారులకు పింఛన్ నగదును ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు చేతులమీదుగా అందజేశారు. జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, వైస్ ఎంపీపీ అక్కినేని శ్రీవాణి, ఎంపీడీఓ వీపీ విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్, వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనారిటీ విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడు పిల్లా చరణ్, నాయకులు పాల్గొన్నారు.

పక్కాగా పోలింగ్ కేంద్రాల పునర్విభజన

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



ఏలూరు(మెట్రో): జిల్లాలో పకడ్బందీగా పోలింగ్ కేంద్రాల పునర్విభజన ప్రక్రియ నిర్వహిస్తామని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో ఓటర్ల జాబితా వారీగా పోలింగ్ కేంద్రాలు పునర్విభజన, ఎస్ఎస్ఆర్–2024 అంశాలపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఓటర్ల జాబితా నుంచి తొలగించిన ఓటర్ల పేర్లను పునః పరిశీలన, విచారణ ప్రక్రియ కూడా పూర్తయిందన్నారు. మృతులు, శాశ్వత వలసలు, ఇతర కారణాలతో నిబంధనల ప్రకారమే ఓటర్ల జాబితా నుంచి ఓటర్లను తొలగించిన విషయాన్ని రాజకీయ పార్టీల నాయకులకు ఆయన వివరించారు. సంక్షిప్త ఓటర్ల జాబితా ప్రక్రియ అత్యంత పారదర్శకతతో నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలోని ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (ఈఆర్‌ఓ)లు, అదనపు ఏఈఆర్‌ఓలు వారి పరిధిలోని ప్రతిఒక్క తొలగింపు పరిశీలన చేశారన్నారు. గత ఏడాదిన్నర కాలంలో సుమారు 70 వేల వరకు మరణించిన వారి ఓట్లను తొలగించడం జరిగిందన్నారు. క్షేత్రస్థాయిలో పొరపాట్లు, సమస్యలు ఉంటే లిఖితపూర్వకంగా ఈనెల 15 లోపు తన దృష్టికి తీసుకురావచ్చన్నారు. ఓటర్ల నమోదు చేర్పులు, మార్పులు నిరంతర ప్రక్రియ అని చెప్పారు. పోలింగ్ కేంద్రాల పునర్విభజనకు సంబంధించి ఏమైనా ప్రతిపాదనలు ఉంటే సమర్పించవచ్చన్నారు. ప్రస్తుతం జిల్లాలో 1,736 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. ఓటర్ల జాబితాల వారీగా పోలింగ్ కేంద్రాలు పునర్విభజన ప్రక్రియ ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించాల్సి ఉందన్నారు. పోలింగ్ కేంద్రాల పునర్విభజన, పోలింగ్ కేంద్రాల భవనాల మార్పు, పేరు మార్పుకు సంబంధించి రాజకీయ పక్షాల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటుచేసి సంబంధిత ప్రతిపాదనలు ఎన్నికల సంఘానికి పంపుతామన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి ఏవీఎన్ఎస్ మూర్తి, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ చల్లన్న దొర, రాజకీయ పార్టీల ప్రతినిధులు కలవకొల్లు సాంబ (వైఎస్ఆర్‌సీపీ), నెరుసు నెలరాజు (బీజేపీ), పాలి ప్రసాద్ (టీడీపీ), ఎం.శిర్రాభరత్‌రావు(బీఎస్పీ), ఈఆర్‌ఓలు కె.పెంచల్ కిశోర్, డా.ఝాన్సీ రాణి, జి.సత్యనారాయణ, సూర్యనారాయణరెడ్డి, బాబ్జి, ఏఈఆర్‌ఓ సోమశేఖర్ పాల్గొన్నారు.

సచివాలయ సేవలకు ఐఎస్‌ఓ గుర్తింపు ఖాయం

రాష్ట్ర సచివాలయాల కో–ఆర్డినేటర్ బాలాజీ




భీమడోలు సచివాలయంలో సేవలను అడిగి తెలుసుకుంటున్న కేరళ బృంద సభ్యులు

భీమడోలు: రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు సత్వర సేవలు అందుతున్నందుకు ఐఎస్‌ఓ (ఇంటర్నేషనల్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్) గుర్తింపు ఖాయమని రాష్ట్ర సచివాలయాల కో–ఆర్డినేటర్ ఎం.బాలాజీ అన్నారు. భీమడోలులో గ్రామ పంచాయతీ, సచివాలయాల ద్వారా ఇంటింటికీ అందుతున్న సేవలను పరిశీలించేందుకు కేరళ నుంచి శ్రీరిషా, ఈశ్వరన్, త్రిశూర్, రషీద్‌లతో కూడిన బృందం గురువారం ఇక్కడకు వచ్చింది. వీరికి సర్పంచ్ పాము సునీతామాన్‌సింగ్, కార్యదర్శి ఎస్.ఠాగూర్‌లు స్వాగతం పలికారు. అనంతరం బృంద సభ్యులు సచివాలయాల్లో అందుతున్న సేవలపై సిబ్బందిని ఆరా తీశారు. రాష్ట్రంలో అమలవుతున్న సచివాలయ వ్యవస్థ దేశంలో మరెక్కడా లేదని, ప్రజల చెంతకే సేవలందించడం ద్వారా సుపరిపాలన సాధ్యమవుతుందని అన్నారు. సీఎం జగన్ మానస పుత్రికగా ఉన్న సచివాలయ వ్యవస్థకు ఐఎస్‌ఓ గుర్తింపు ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. సచివాలయ సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు.

కేరళలో కంటే మిన్నగా.. రాష్ట్ర సచివాలయాల కో–ఆర్డినేటర్ బాలాజీ మాట్లాడుతూ కేరళలో అక్కడి ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సేవలకు ఐఎస్‌ఓ గుర్తింపు వచ్చిందని, అక్కడి కంటే మిన్నగా రాష్ట్రంలో సచివాలయాల ద్వారా ప్రజలకు సేవలందిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని 13,320 పంచాయతీలు, సచివాలయాల్లో తొలుతగా జిల్లాకు రెండేసి చొప్పున 55 పంచాయతీలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశామని, అందులో భీమడోలు కూడా ఉందన్నారు. భీమడోలు గ్రామ పంచాయతీ, సచివాలయాల సేవలకు ఐఎస్‌ఓ గుర్తింపు పొందే అర్హతలు ఉన్నాయన్నారు. దశల వారీగా అన్ని పంచాయతీలు, సచివాలయాలకు ఐఎస్‌ఓ గుర్తింపు వస్తుందన్నారు. అనంతరం కేరళ బృందాన్ని ఘనంగా సత్కరించారు. డీఎల్‌పీఓ పూర్ణ చంద్రశేఖర్, ఈవోఆర్‌డీలు ముత్తయ్య, రవిశంకర్, కార్యదర్శి శివనారాయణ, చైతన్య యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పాము మాన్‌సింగ్, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇంటికే ఫోర్టిఫైడ్ బియ్యం

జేసీ లావణ్యవేణి



ఏలూరు(మెట్రో): జిల్లాలోని కార్డుదారుల ఇంటి వద్దకే ఎండీయూ వాహనాల ద్వారా ఫోర్టిఫైడ్ బియ్యాన్ని పంపిణీ చేయనున్నట్టు జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి తెలిపారు. గురువారం పౌరసరఫరా, రెవెన్యూ అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. బియ్యం, ఇతర నిత్యావసరాలను జిల్లాలోని 395 ఎండీయూ వాహనాల ద్వారా లబ్ధిదారుల ఇంటి వద్దే అందిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో పోషకాలతో కూడిన ఫోర్టిఫైడ్ బియ్యం కెరెనల్స్‌ను అందిస్తోందన్నారు. ఈ మేరకు జిల్లాలో 6,42,526 మంది కార్డుదారులకు సరఫరా చేస్తున్నామన్నారు. పీడీఎస్ బియ్యాన్ని అక్రమ రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని జేసీ హెచ్చరించారు. బియ్యం అక్రమ రవాణాపై పౌరసరఫరాలు, రెవెన్యూ అధికారులు, లీగల్ మెట్రాలజీ అధికారులతో జాయింట్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసి విస్తృత తనిఖీలు చేయాలన్నారు. పీడీఎస్ రవాణా చేసే వారిపై నిబంధనలు ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తరచుగా కేసులు నమోదవుతున్న వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలన్నారు. వీఆర్‌వో స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులకు సమాచారం వచ్చిన వెంటనే స్పందించి కేసులు నమోదు చేయాలన్నారు. దీనిపై జిల్లాస్థాయిలో పౌరసరఫరాల కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలన్నారు. 2023లో ఇప్పటివరకు 6 (ఎ), క్రిమినల్ కేసులు 192 నమోదయ్యాయన్నారు. ఈ నెలలో ఇప్పటివరకు తొమ్మిది కేసులు నమోదయ్యాయని, వీటిపై చర్యలు తీసుకోనున్నామని జేసీ లావణ్యవేణి చెప్పారు.

'ఆడుదాం ఆంధ్ర'కు పటిష్ట ఏర్పాట్లు

సాక్షి, భీమవరం: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల ప్రతిభను వెలికితీయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలను నిర్వహించనుందని జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ జిల్లాలోని 535 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో క్రీడాపోటీల నిర్వహణకు నెలాఖరు నాటికి ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. గ్రామ సచివాలయాల స్థాయిలో ఎంపీడీఓ, వార్డు స్థాయిలో పురపాలక సంఘం కమిషనర్లు బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు. క్రీడల నిర్వహణకు దాతలు, స్వచ్ఛంద సేవా సంస్థలు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు, సిబ్బందికి స్త్రీ, పురుషులకు వేర్వేరుగా వసతి గృహాలు కేటాయించాలని ఆదేశించారు.

నేడు రాట్నాలకుంటలో 'జగనన్నకు చెబుదాం'

పెదవేగి: ప్రతి బుధవారం, శుక్రవారం మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం గ్రీవెన్స్‌డేలో భాగంగా శుక్రవారం పెదవేగి మండలం రాట్నాలకుంటలో కలెక్టర్ స్థాయిలో మొట్టమొదటి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు రాట్నాలకుంట మెయిన్‌రోడ్డులోని సాయిబాబా గుడి వద్ద గల అన్నపూర్ణ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉదయం 10 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుంది. కలెక్టర్‌తో పాటు జిల్లా స్థాయి అధికారులు హాజరుకానున్నారు. అలాగే ఈనెల 13న చింతలపూడి మండలంలో, 15న ద్వారకాతిరుమల మండలంలో, 20న టి.నరసాపురం మండలంలో, 22న ఉంగుటూరు మండలంలో, 27న ముసునూరు మండలంలో, 29న కలిదిండి మండలంలో మండలస్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించనున్నారు.

క్లుప్తంగా

పేదల సొంతింటి కల సాకారం



తణుకు జగనన్న కాలనీలో నూతన గృహప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: పేదలందరికీ సొంతింటి కల నిజం చేయాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోట్లాది రూపాయిలు వెచ్చించి జగనన్న కాలనీలు ఏర్పాటు చేస్తున్నారని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు ఆర్డీఓ కార్యాలయం సమీపంలోని జగనన్న కాలనీలో గురువారం నూతనంగా గృహప్రవేశం చేసిన నూకల కనకదుర్గ, వెంకన్నబాబు దంపతులను ఆశీర్వదించి కుటుంబసభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, పైబోయిన ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

108 సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి



జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీకి వినతిపత్రం అందిస్తున్న 108 సిబ్బంది

ఏలూరు(మెట్రో): జిల్లాలోని 108 సిబ్బంది సమస్యలు పరిష్కారానికి ఉన్నతాధికారులతో మాట్లాడి కృషి చేస్తామని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీప్రసాద్ అన్నారు. ఏలూరులోని జెడ్పీ క్యాంప్ కార్యాలయంలో చైర్మన్‌ను ఏలూరు జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లాల 108 యూనియన్ నాయకులు కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. 108 వాహనాలు నిలిపేందుకు షెల్టర్‌తో పాటు మందులు నిలువ చేసేందుకు స్థలం లేకుండా పోయిందని తెలిపారు. దీంతో వర్షాకాలంలో మందులు తడిసిపోయి నిరుపయోగంగా మారుతున్నాయని, వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయన్నారు. వాహనాలు నిలిపేందుకు, మందులు ఉంచేందుకు షెల్టర్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని చైర్మన్ హామీ ఇచ్చారు. యూనియన్ అధ్యక్షుడు ప్రసాద్, జనరల్ సెక్రటరీ కె.రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా.. ముకుందా



పెనుగొండలో శ్రీకృష్ణ వేషధారణలో చిన్నారులు



కొయ్యలగూడెం మండలం రేపల్లెవాడలో కృష్ణాష్టమి వేడుకల్లో చిన్నారులు



ఏలూరు జిల్లా యాదవ సంఘం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఉమ్మడి జిల్లాలో గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు. అలాగే ఉట్టి కొట్టే కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఏలూరు గో సంరక్షణ సమితి ప్రాంగణంలోని రాధాకృష్ణ మందిరంలో వేడుకలు ఘనంగా జరిపారు. అలాగే కృష్ణ చైతన్య సంఘం ఆధ్వర్యంలో ఏలూరు శాంతి నగర్ శ్రీ రాజరాజేశ్వరి కళ్యాణ మండపంలో జన్మాష్టమి వేడుకలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



గోపిక వేషధారణలో చిన్నారి





గోమాత వద్ద చిన్ని కృష్ణుడు



ఏలూరు గోసంరక్షణ సమితిలో విశేషాలంకరణలో రాధాకృష్ణులు





ఏలూరు గోసంరక్షణ సమితిలో..



ఏలూరు గాంధీ నగర్‌లో ఉట్టి కొడుతున్న యువకులు

శ్రీవారి క్షేత్రంలో శ్రీకృష్ణాష్టమి శోభ

ద్వారకాతిరుమల: చినవెంకన్న దివ్య క్షేత్రంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు గురువారం నేత్రపర్వంగా జరిగాయి. కృష్ణాష్టమి నాడు కృష్ణునికి ఇష్టమైన గోవులను పూజిస్తే అంతా మంచి జరుగుతుందని పండితులు తెలిపారు. ఈ క్రమంలోనే కొండపైన గోసంరక్షణశాలలో పురోహితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ ఆలయ ఏఈఓ పి.నటరాజారావు, పలువురు సిబ్బంది, భక్తులు గోవులకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం వాటికి దాణాను అందించారు. గోశాల వద్ద సప్తగోకులంలో కొలువైన శ్రీకృష్ణుడిని పెద్ద ఎత్తున భక్తులు దర్శించి, ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పురోహితులు కృష్ణుడికి పూజలు జరిపి, హారతులిచ్చారు. ఆ తరువాత భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. శ్రీకృష్ణ జన్మాష్టమి మరుసటి రోజు ఉట్ల పండుగను జరపడం ఇక్కడ సంప్రదాయంగా వస్తోంది. ఈ క్రమంలోనే శుక్రవారం సాయంత్రం శ్రీవారి క్షేత్రంలో ఉట్ల పండుగను వైభవంగా జరుపనున్నట్టు ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు. ఉభయ దేవేరులతో శ్రీవారు క్షేత్ర పురవీధుల్లో ఊరేగుతారని తెలిపారు.



శ్రీవారి గోసంరక్షణశాలలో గోమాతకు పూజలు నిర్వహిస్తున్న ఆలయ ఏఈఓ నటరాజారావు, తదితరులు

సామూహిక వరలక్ష్మీ వ్రతాలకు ఏర్పాట్లు పూర్తి

ద్వారకాతిరుమల: చినవెంకన్న దివ్య క్షేత్రంలో ఈ నెల 8న నాలుగో శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని దేవస్థానం నిర్వహించనున్న సామూహిక వరలక్ష్మీ వ్రతాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. వ్రత వేడుకలను పురస్కరించుకుని ఆలయ అనివెట్టి మండప ప్రాంతాన్ని దేవస్థానం సిబ్బంది గురువారం సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. అమ్మవారిని వేంచేపు చేసేందుకు మండపంలో ప్రత్యేక వేదికను నిర్మించారు. వేదిక ముందు మహిళా భక్తులు కూర్చునేందుకు వీలుగా గ్రీన్ మ్యాట్‌లు ఏర్పాటు చేశారు. మండప ప్రాంతాన్ని మామిడి తోరణాలు, అరటి బోదెలతో శోభాయమానంగా అలంకరించారు. ప్రత్యేక దర్శనం క్యూలైన్లను ఏర్పాటు చేశారు. శుక్రవారం ఉదయం 9.30 గంటల నుంచి జరగనున్న సామూహిక వరలక్ష్మీ వ్రత వేడుకల్లో అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు కోరారు. మహిళలకు పూజా సామాగ్రిని దేవస్థానమే ఉచితంగా అందిస్తుందని తెలిపారు.



సామూహిక వరలక్ష్మీ వ్రతాల నిర్వహణకు అనివేటి మండపంలో వేదికను సిద్ధం చేస్తున్న ఆలయ సిబ్బంది

విద్యుత్ షాక్‌తో నాలుగు గేదెలు మృతి



నూజివీడు: వేగంగా వచ్చిన లారీ హారన్‌కు బెదిరిపోయి రోడ్డు పక్కన ఉన్న తోటలోకి పరుగులు తీసిన పాడి పశువులు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాయి. నూజివీడు మండలం మీర్జాపురంలో గురువారం ఈ ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గుండుబోయిన శ్రీనివాసరావు పాడి పశువులను సాయంత్రం ఇంటికి తోలుకెళ్తుండగా స్థానిక వైన్ షాప్ సమీపంలోకి వచ్చే సరికి వేగంగా వచ్చిన లారీ హారన్ మోతకు బెదిరిపోయి పశువులు పరుగులు తీశాయి. రోడ్డుపక్కనే ఉన్న యార్లగడ్డ వెంకటేశ్వరరావుకు చెందిన పామాయిల్ తోట వైపు వెళ్లాయి. తోటలో కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు తగిలి షాక్‌తో అక్కడికక్కడే నాలుగు గేదెలు, దూడ మృత్యువాత పడ్డాయి. పాడిపశువుల మృతితో జీవన భృతి కోల్పోయానని పశువుల యజమాని శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. గేదెల విలువ దాదాపు రూ.3 లక్షలకు పైగానే ఉంటుందని వాపోయాడు. తనకు నష్టపరిహారం అందించాలని వేడుకుంటున్నాడు.

విద్యార్థులతో ఉపాధ్యాయుడి వికృత చేష్టలు

కుక్కునూరు: విద్యాబుద్ధులు చెప్పి మంచి నడవడిక నేర్పించాల్సిన ఉపాధ్యాయుడు విద్యార్థులతో అసభ్యంగా మాట్లాడడంతో విసిగిపోయిన విద్యార్థులు విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పడంతో వారు స్థానిక పెద్దల ద్వారా ఉపాధ్యాయుడిని నిలదీశారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న అరుణ్‌కుమార్ మద్యం తాగి విధులకు హాజరుకావడంతో పాటు విద్యార్థులను అసభ్యంగా ప్రశ్నలు అడిగినట్లు తెలిసింది. దీంతో విద్యార్థులు తల్లిదండ్రులకు ఈ విషయాన్ని చెప్పడంతో స్థానిక పెద్దల సమక్షంలో సదరు ఉపాధ్యాయుడ్ని నిలదీశారు. ఉపాధ్యాయుడు తన తీరు మార్చుకోవాలని పెద్దలు హెచ్చరించినట్టు సమాచారం. ఈ విషయమై ఎంఈఓ తెల్లం బాబురావును వివరణ కోరగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులతో అరుణ్‌కుమార్ అనే ఉపాధ్యాయుడు అనుచితంగా వ్యవహరించిన విషయం తన దృష్టికి వచ్చిందని.. సదరు ఉపాధ్యాయుడిపై వచ్చిన ఆరోపణలను డీవైఈఓ దృష్టికి తీసుకెళ్లామన్నారు.

నీటమునిగిన ఎద్దెలవాగు వంతెన

వేలేరుపాడు: భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం గురువారం 29 అడుగులకు పెరగడంతో వేలేరుపాడు మండలంలో కొయిదా రహదారిలో ఎద్దెలవాగు వంతెన గురువారం నీట మునిగింది. దీంతో దిగువన ఉన్న 16 గిరిజన గ్రామాలకు మండల కేంద్రమైన వేలేరుపాడు నుంచి రాకపోకలు స్తంభించిపోయాయి. దిగువ ప్రాంతంలోని కొయిదా, కట్కూరు, కాచారం, తాళ్ళగొంది, పూసుగొంది, చిట్టంరెడ్డిపాలెం, ఎడవల్లి, బుర్రెడ్డిగుడెం, టేకూరు, సిద్దారం, కుంకుడు కొయ్యలపాకలు మరో ఐదు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. గత మూడు నెలలుగా ఈ వంతెన నీటమునగడం ఇది ఐదోసారి.

ఆత్మహత్య ఘటనలో సీఐపై కేసు నమోదు

దెందులూరు: ఇటీవల దెందులూరు రైల్వే పట్టాలపై ఆత్మహత్య చేసుకున్న చెక్క తేజమూర్తి సంఘటనలో ఏలూరు రైల్వే ఎస్సై నర్సింహారావు కేసు నమోదు చేశారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏలూరు వన్‌టౌన్ సీఐ ఎస్.రాజశేఖర్, లాయర్ సుబ్బారావు, భార్య, అత్తమామ, మరో ఇద్దరిపై 306 సెక్షన్ కింద కేసు నమోదు చేశామన్నారు. నివేదికను రైల్వే ఎస్పీకి పంపినట్లు చెప్పారు.

ఉద్యోగం పేరిట మోసంపై ఫిర్యాదు

ఏలూరు టౌన్: అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి మోసం చేసిన వ్యక్తిపై ఫిర్యాదు చేశారు. ఏలూరు అశోక్‌నగర్‌కు చెందిన వణుకూరి మోహన్ తన అక్క కుమార్తెకు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పోస్టు కోసం దరఖాస్తు చేశారు. విజయవాడకు చెందిన కొమ్మా అభినవ్ తాను ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి రూ.4.25 లక్షలు నగదును 2021లో తీసుకున్నాడు. అప్పటి నుంచి సమాధానం చెప్పకపోవడంతో మోహన్ ఏలూరు టూటౌన్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

29 నుంచి బాస్కెట్‌బాల్ పోటీలు

ఏలూరు రూరల్: ఈ నెల 29 నుంచి అక్టోబర్ 2 వరకూ పశ్చిమగోదావరి జిల్లా మార్టేరులో 9వ ఆంధ్రప్రదేశ్ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ మెన్, ఉమెన్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నాయని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.కృష్ణారెడ్డి, కార్యదర్శి గవ్వ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక చేపట్టనున్నామని వెల్లడించారు. ఈ నెల 10న సాయంత్రం 4 గంటలకు ఏలూరు కస్తూర్బా బాలికల పాఠశాలలో ఉమెన్ జట్టు ఎంపిక పోటీలు, ఈ నెల 17న మార్టేరు ఎస్‌వీజీ జెడ్పీ పాఠశాలలో సాయంత్రం 3 గంటలకు మెన్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. మరింత సమాచారం కోసం 77804 84313 (మార్టేరు) 94403 49534(ఏలూరు) ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కొనసాగుతున్న స్వమిత్వ శిక్షణ

ఏలూరు(మెట్రో): స్వమిత్వ బ్యాచ్-2 శిక్షణా కార్యక్రమం కొనసాగుతున్నట్లు డీపీఆర్‌సీ వైస్ ప్రిన్సిపాల్, డీపీవో తూతిక శ్రీనివాస విశ్వనాథ్ తెలిపారు. గురువారం ఏపీఎస్‌ఐఆర్ డీపీఆర్ డైరెక్టర్ జె.మురళీ పాల్గొని పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారన్నారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా పరిధిలోని గ్రేడ్-1 నుంచి గ్రేడ్-5 వరకు గల 208 మంది పంచాయతీ కార్యదర్శులు ఈ శిక్షణలో పాల్గొన్నట్లు చెప్పారు.